
## వి. ప్రతిమ

# శృం'గారం'

## పెద్దలకు A మాత్రమే

## సెంటర్ సెన్సేషన్



"సెక్స్ అనేది ఒక ఉద్యానవనం లాంటిది. కొంతమంది మొదటి వరుస పూలని చూసే 'అంతా చూశాం, అద్భుతంగా వుంది' అనుకోవచ్చు. మరి కొందరు మరికాస్త లోపలికి వెళ్ళి జింకల్ని, జలపాతాల్నీ చూడొచ్చు. ఇంకా కొంత మంది ఇంకా లోపలికి వెళ్ళి పర్వత పంక్తుల్నీ, యోగసిద్ధుల్నీ కనుక్కొని వుండొచ్చు".

చదువుతోన్న పుస్తకాన్ని గుండెల కానించుకుని కాళ్ళుచాపి రిలాక్సయి కళ్ళు మూసుకుని ఆలోచనలో పడింది స్వరూప.

చిగురాకుల్లాంటి ఆమె పెదవులు స్వల్పంగా కంపిస్తున్నాయి.

ఎత్తైన ఆమె గుండెలు ఎగిసెగిసి పడుతున్నాయి.

తను చదివిన వాక్యాల్ని మరోసారి చూసి మళ్ళీ పుస్తకాన్ని మూసేసింది.

సెక్స్ గురించి ఇంత డీప్‌గా కూడా ఆలోచిస్తారా? శృంగారానికి ఇంత అధిక ప్రాధాన్యత నిస్తారా? ఎప్పుడో తీరిక దొరికినప్పుడు, అలిసిపోకుండా ఉన్నప్పుడు భర్త తన కోరిక తీర్చుకోవడం మాత్రమే తనకు తెలుసు... దాని గురించి ఆతృతగా ఎప్పుడూ వుండదు అరుణ్... మరి... మరి తను మొదటి వరుస పూలని చూసినట్లా? లేక... లేక..." తన ఆలోచనలకి తనకే నవ్వొచ్చింది స్వరూపకి.

ఆ సాయంత్రం తన స్నేహితురాళ్ళిద్దరూ మాటల సందర్భంలో అన్న మాటలు గుర్తొచ్చాయి.

"ఏమో బాబూ... ఒక్కరోజు కూడా ఖాళీగా వుండనివ్వరు. ఎప్పుడూ అదే ఆలోచన. ఎంత పిచ్చో చెప్పలేను... ఒక్కోసారి బాగా విసుగ్గాకూడా అన్పిస్తుంది" ముద్దుముద్దుగా భర్తని గురించి కంప్లైయింటిచ్చింది సుధ.

సర్లే... పిల్లలు హాస్టళ్ళకెళ్ళిపోయాక ఈమధ్య మరీ మార్నింగ్ షోలూ, మ్యాట్నీలూ కూడా ఎక్కువైపోయాయి. అసలు వయసు వస్తోందో, పోతోందో అర్థంకావడంలేదు సుధా" సిగ్గులొలకబోస్తూ నవ్వింది లత.

ఇద్దరూ ముసిముసిగా నవ్వుతూ స్వరూపవైపు చూశారు తను ఏం చెప్తుందోనన్నట్లుగా. ఆ టాపిక్‌ని అంతటితో కట్‌చేయాలని జ్యూస్ తీసుకొస్తానంటూ అక్కడ్నుండి లేచి ఫ్రిజ్ వైపు నడిచింది తను.

ఇప్పుడీ అర్ధరాత్రి ఒంటరిగా పడుకుని పుస్తకం చదువుతోంటే స్నేహితురాళ్ళ మాటలు పదేపదే జ్ఞాపకానికొచ్చి ఆమెను అల్లరి పెడ్తున్నాయి.

వాళ్ళ దగ్గరైతే బయటపడకుండా తెలివిగా దాటేసింది కానీ ఇలా ఒంటరిగా కూర్చుని ఆత్మవంచన లేకుండా ఆలోచించగల్గితే తను... తను నిజంగా సుఖపడ్తోందా? ప్చ్... అరుణ్‌కి ఎందుకని ఎప్పుడోతప్ప కావాలన్పించదు తను... తనకి మాత్రం...?

నవ్వొచ్చింది స్వరూపకి... ఆ నవ్వు ఆనందంతో కూడిందా, లేక బాధా మిళితమై వున్నదా అన్నది ఆమెకే అర్థంకావడంలేదు.

పుస్తకాన్ని టీపాయ్ మీదుంచి నెమ్మదిగా ప్రక్కకి ఒత్తిగిలిందామె. అలా తిరగడంలో ఆమె ధరించిన నైటీ మోకాళ్ళపైకి తొలగింది. ట్యూబులైటు కాంతిలో అందంగా, తెల్లగా, నునుపుగా మెరుస్తోన్న ఆమె కాళ్ళు, ఆచ్ఛాదన లేని ఆమె గుండ్రటి భుజాలూ అజంతా శిల్పాన్ని గుర్తుకు తెస్తున్నాయి.

ఆ గదిలోని ఏ.సి ఆమెను చల్లబరచకపోగా ఆమె విడుస్తోన్న వేడి నిట్టూర్పులకు ఆమె చుట్టూవున్న వాతావరణం వెచ్చబడుతూంది.

ఉదయం లేవగానే వెళ్ళిపోయి మధ్యాహ్నం రాకుండా రాత్రయినా భోజనానికి వస్తాడో, రాడోతెలీని భర్త కోసం ఆర్తిగా ఎదురుచూస్తోందామె.

ఎన్ని సుందర సాంధ్యల్నీ, సుదీర్ఘమైన నిద్రలేని రాత్రుల్నీ అతడికోసం ఎదురు చూస్తూ గడిపేసిందో ఆమెకు గుర్తులేదు.

నిరీక్షణ అసహనంగానూ, అసహనం కోపంగానూమారి ఆమెను అస్థిమిత పరుస్తోంది. కాలం కొవ్వొత్తిలా కరిగిపోతూ అనుభూతుల మైనాన్ని వదిలి వెళ్తూంది.

ఆమె ఆలోచనలు ఎంతకీ తెగడం లేదు. పుస్తకం తెరిస్తే అందులోని వాక్యాలు కంటబడి మళ్ళీ మళ్ళీ అదే ఆలోచన. అందుకే నిద్రపోవాలని గట్టిగా ప్రయత్నించి ఘోరంగా ఓడిపోతోంది.

"చలిగాలి వీచింది
తెలవారబోతోంది
ఇకనైనా యిలు జేరవా ప్రియా
ఇకనైనా యిలు చేరవా
ఎదురూ తెన్నులు చూసి
ఎద బెదిరిపోయింది
బరువాయె నా మేను
చెరువాయె కన్నీరు...

ఎప్పటిదో గేయం పదే పదే జ్ఞాపకానికి కొచ్చి మనసు బరువెక్కుతోంది. జీవితంలోంచి స్పందనా, భావుకత్వమూ, కవిత్వమూ ఇవన్నీ జారిపోయి ఎంతోకాలమైపోయింది. ఒకప్పుడు చిన్న చిన్న కవితలు వ్రాసి తను పత్రికలకి పంపేదని చెప్తే ఇప్పట్లో తెలిసిన వాళ్ళెవరూ నమ్మలేరు.

మనసు అట్టడుగు పొరల్లో వుండిపోయిన ఆ ఒక్క పర్సెంటు స్పందనా అప్పుడప్పుడూ ఇలా బయటపడ్తూ వుంటుంది నేనున్నాను సుమా అంటూ.

గోడ గడియారం పన్నెండు గంటలు

ఆంధ్రభూమి సెంటర్ సెన్సేషన్
కథ రెండవ పేజీ చదువుతున్నారు



కొట్టేంది
భారంగా నిట్టూర్చిందామె.

* * *

ఆ సమయంలో విలాసపురుషుడైన స్వరూప భర్త త్వరగా పని ముగించుకుని ఆరాటంగా భార్య దగ్గరకు పరిగెత్తుకొచ్చే మూడ్‌లో లేదు.

అసలతడికి భార్య అనే ఓ మనిషుందనీ, ఆమె తన కోసం కళ్ళు కాయలు కాచేలా ఆత్మీయత నిండిన గుండెతో ఆర్తిగా ఎదురు చూస్తోందనీ అతడికి గుర్తులేదు.


స్నేహితుడింటిలో ఓ పార్టీలో పూర్తిగా త్రాగిన మైకంలో సోఫాలో పడి వున్నాడు. ఫ్రీగా వుండటం కుదరదని సాధారణంగా భార్యని తీసుకురాడిలాంటి పార్టీలకి.

చాలా సేపటి తర్వాత హఠాత్తుగా మెలకువ వచ్చిందతడికి ఒక్కసారిగా లేచి కూర్చుని చుట్టూ కలయచూశాడు. మసక చీకట్లో అతడికేమీ కన్పించలేదు. కళ్ళు నులుముకుని మళ్ళీ చూశాడు.

పార్టీకొచ్చినవాళ్ళంతా వెళ్ళిపోయినట్లున్నారు. అతడి రేడియమ్ డయల్ వాచీ తెల్లవారు ఝామున మూడమిందని చెప్తోంది. ఒక్కసారిగా ఒళ్ళు విరుచుకుని పైకిలేచాడతడు.

తమాషా ఏమిటంటే అప్పుడు కూడా అతడికి ఇంటికి వెళ్ళాలనే ధ్యాస కలగలేదు. ఆ సాయంత్రం పార్టీలో

## ఆంధ్రభూమి సెంటర్ సెన్సేషన్ కథ మూడవ పేజీ చదువుతున్నారు



తీసికెళ్ళింది తేజోలత.

... శృంగారం, ది సెక్స్ ఆ గదిలో రాజ్యమేలుతూ స్నేహాన్నీ, స్నేహాపు విలువల్నీ డామినేట్ చేసేసింది.

ఆ క్షణంలో అతడికి బెడ్‌ల్యాంప్ వెలుతుర్లో ఒంటరితనంతో బాధపడ్తూ దిండుని గట్టిగా గుండెల కదుముకుని ఆలోచనల్లో పూర్తిగా తననే నింపుకున్న భార్య గుర్తుకురాలేదు.

ఆమెలోనూ వెచ్చటి రక్తం ఉరకలు వేస్తూ కోరికల్ని రేపుతోందనీ, అజంతా శిల్పం లాంటి అందమైన 'రూప అద్భుతంగా అలంకరించుకుని భర్త చూడకుండా తన వైపు చూసి కన్నుగీటిన స్నేహితుడి భార్య తేజోలత పదే పదే గుండెను తట్టి లేపుతోంది.

అరుణ్ జల్సా పురుషుడు. తన అందంతోనూ, అపారమైన తెలివి తేటల్తోనూ అమ్మాయిల్ని ఇట్టే బుట్టలో వేసుకోవడం అతడికి వెన్నతో పెట్టిన విద్య. కానీ పైకి మాత్రం బొత్తిగా పెద్ద మనిషిలా వుంటాడు.

అమ్మాయిల వెంటపడడమే అతడి హాబీ కాకపోయినా దొరికిన అవకాశాన్ని వినియోగించుకోకపోవడం అతని జాతకంలోనే లేదు.

మాంసం తింటున్నాం కదాని ఎముకల్ని మెళ్ళో వేసుకుతిరగడం అతడి అభిమతం కాదు. అతడి ఏ చర్య అయినా గుంభనంగా ప్రక్కవాళ్ళకి తెలీకుండా అతి రహస్యంగా జరిగిపోతూ వుంటుంది.

అందులోని భాగమే ఆ రాత్రి తేజోలతతో అతడి సమాగమం. మెల్లిగాలేచి సింక్ దగ్గరికెళ్ళి మొహం కడుక్కున్నాడు. ఫ్రిజ్‌లోంచి చల్లటి బాటిల్ తీసి కొంచెం నిలదొక్కుకున్న తర్వాత బాటిల్ని శబ్దమొచ్చేలా క్రింద పడేశాడు. మెయిన్ డోర్‌ని లాగి గట్టిగా చప్పుడయ్యేలా మూశాడు.

అతడికి తెలుసు తనకన్నా రెండు పెగ్గులు ఎక్కువగా తీసుకున్న స్నేహితుడికి అంత త్వరగా మెలుకువరాదని.

అతడూహించినట్లుగానే ఆ చప్పుడికి భర్త పక్కలో నిద్రిస్తోన్న తేజోలత ఉలిక్కిపడి లేచి కూర్చుంది. భర్త నిద్రిస్తున్నాడని నిర్ధారణ చేసుకుని తడబడే అడుగుల్తో నడిచి బెడ్‌రూమ్ తలుపు చప్పుడవకుండా ముందుకు లాగి అరుణ్ దగ్గరికొచ్చింది.

ముందూ వెనుకా చూడకుండా ఆవేశంతో ఆమెని అల్లుకుపోయాడు అరుణ్. అందుకోసమే కాచుక్కూర్చున్నట్లుగా హడావిడిగా అతడ్ని మరో బెడ్ రూంలోకి ముందు ఈ తేజోలత దివిటీ ముందు దీపం లాంటిదని ఒక్క క్షణం నిశితంగా ఆలోచించి వుంటే అతడికి తట్టివుండేది.

దాదాపు తెల్లవారుతుండగా వచ్చి కాలింగ్ బెల్ కొట్టిన భర్తని నిర్లిప్తంగా ఆహ్వానించి మెల్లిగా తీసికెళ్ళి బెడ్ రూములో పడుకోబెట్టింది స్వరూప.

* * *

ఆ ఉదయం అతడు చాలా ఫ్రెష్‌గా వున్నాడు.

## ఆంధ్రభూమి సెంటర్ సెన్సేషన్ కథ నాల్గవ పేజీ చదువుతున్నారు

ఎప్పుడూ ఏదో మునిగిపోయినట్లుగా ఆఫీసు పనుల్లో నిమగ్నమయి వుండే అరుణ్ మంచి బిజినెస్ ఎగ్జిక్యూటివ్. అమ్మాయిల్తో అనుభవాల్ని ఎంతగా కోరుకుంటాడో ఆఫీసు పనుల్ని అంతకంటే సమర్థవంతంగా నిర్వహించగలడు.

నిర్భావంగా స్వరూప అతడి ప్లేట్లో ఇడ్లీ వడ్డిస్తుండగా అమాంతం దగ్గరికి లాక్కుని బుగ్గమీద పెదవులాన్చి చెప్పాడతడు.

'ఆయామ్‌సారీ... రియల్లీ సారీ... రాత్రంగా బాగా వెయిట్ చేశావు కదూ. ఫోన్ చేయడం కుదర్లేదు..''

అతడి చేతుల్లోనుండి మెల్లిగా విడివడి ఎర్రబారిన బుగ్గని పమిట కొంగుతో తుడుచుకుంది స్వరూప. ఇలాంటి సంఘటనలు ఆమె జీవితంలో చాలా అరుదు. ఎప్పుడోతప్ప భర్త ఇలాంటి మూడ్‌లో వుండడు.

త్రాగి రాత్రంతా ఇంటికిరాని మర్నాడు మాత్రమే అతడిలా వుంటాడు. బహుశా గిల్టీ ఫీలింగ్ కావొచ్చు.

అతడిక్కావల్సినవేవో మౌనంగా వడ్డిస్తోంది స్వరూప. ఆ ముఖంలో ఏ భావమూ లేదు. నిర్లిప్తంగా వుంది.

అదేమీ పట్టించుకోకుండా చెప్పాడతడు.

''రూపా డార్లింగ్ సాయంత్రం ఎక్కడికైనా బయటికెళ్దాం త్వరగా వచ్చేస్తాను. వంట చేయకు''

అన్నట్లుగానే ఆ సాయంత్రం త్వరగా వచ్చేశాడు అరుణ్. హడావుడి పెట్టి ఆమెను షాపింగ్‌కి తీసికెళ్ళాడు. ఆమె అడిగినవీ, లేనివీ అన్నీ కొనిపెట్టాడు. షాపింగయ్యాక సరదాగా సిటీ అంతా తిప్పాడు. వద్దంటున్నా వినకుండా సముద్ర తీరానికి తీసికెళ్ళాడు.

చాలా రోజుల తర్వాత తీరిగ్గా ఒకరెదురుగా ఒకరు కూర్చున్నారు... సముద్ర తీరాన సుండల్ తింటూ వేడివేడిగా..

ఆరోజు పౌర్ణమి కావడంతో ఆమె గుండెలోతుల్లోని అంతుచిక్కని భావాల్లాగే సముద్రుడు కూడా ఎగిసెగిసి పడుతున్నాడు.

విసురుగా వచ్చిన అలలు చాచిన ఆమె కాళ్ళను పాదాల వరకూ తడిపి వెళ్తున్నాయి. అప్రయత్నంగా చీరను పైకి లాక్కుంది స్వరూప.

తడిసిన తెల్లటి ఆమె పాదాలు. గోళ్ళు ఎర్రటి రంగు దిద్ది వింత అందంతో మెరుస్తున్నాయి.

ఆదేమీ పట్టనట్లుగా దూరంగా నూరీ డ్రస్సుల్లో వున్న కాలేజీ అమ్మాయిల్ని చూసీ చూడనట్లుగా చూస్తున్నాడు అరుణ్ భర్త చూపుల్ని గమనించిన స్వరూప మనస్సు చివుక్కుమంది.

అది క్షణకాలం మాత్రమే. ఇలాంటివి బాగా అలవాటయిపోయాయి ఆమెకి. పెళ్ళయింది మొదలూ బయటికెళ్ళిన ప్రతీసారి ప్రక్కనున్న అందాల రాశిని వదిలేసి పరాయి అమ్మాయిల్ని తేరిపార చూడ్డం అతడికి కొత్తేమీ కాదు.

క్రొత్తల్లో చెప్పలేనంత బాధగా, తన మనసెవరో రంపంతో కోస్తున్నట్లుగానూ ఫీలయ్యేది. కానీ తరువాత తరువాత అలవాటయిపోయింది.

తమాషా ఏమిటంటే ఇన్ని వందల మంది అమ్మాయిల్లో ఏ ఒక్క అమ్మాయైనా ధైర్యం చేసి ''ప్రక్కన అందమైన భార్యనుంచుకుని నీకిదేం పోయేకాలం'' అంటూ అడగలేదు.... అలా ఏ అమ్మాయైనా అడిగితే ఎలా వుంటుంది అంటూ ఆలోచిస్తే ఆమెకి నవ్వొచ్చింది.

'ఏంటి మళ్ళీ ఆలోచనలో పడ్డావా?' అడిగాడతడు.

''అబ్బే ఏం లేదు....చెప్పండి'' అంది.

సరదగా మాట్లాడ్డం మొదలు పెట్టాడతడు. అలా అలా కబుర్లు చెప్తూ భర్త మంచి మూడ్‌లో వుండగా అడిగింది స్వరూప.

''చూడండి... ఎందుకు... ఎందుకు మీకు నేనంటేనే పట్టదు. నా స్నేహితులంతా నువు చాలా అందంగా వుంటావు కదా మీ ఆయన నిన్ను ఒక్క క్షణం కూడా నిద్రపోనివ్వడేమో అంటూ బాగా ఏడిపిస్తూ వుంటారు. కానీ మీకు మాత్రం ఎప్పుడో తప్ప ఆ ధ్యాసే వుండదు... నేను... నేను కారణం తెలుసుకోవచ్చా?'' ఇలా అడగడానికి ఆమె సర్వశక్తులూ కూడదీసుకోవాల్సి వచ్చింది.

ఇది చాలా సున్నితమైన విషయం కదా... దాన్ని గురించి మృదువుగా మాట్లాడ్డమే ఆమె కిష్టం.

చూస్తుండగానే వాతావరణం వేడెక్కిపోయింది.

అతడి కళ్ళల్లో కోపపుజీర తొంగి చూస్తోంది.

అతడికి ఎప్పుడు కోపం వస్తుందో, ఎందుకు వస్తోందో ఆమెకి అర్థం కాదు. కారణం లేకుండానే కోపం వస్తూ వుంటుంది అతడ్ని.

''ఎప్పుడూ అందుబాటులో వుంటావు కనుక నువ్వు రుచించవు'' అంటూ చెప్పడానికి అతడి నాకరికత అడ్డొచ్చింది.

సరైన సమాధానం చెప్పలేని అశక్తత అతడిని రెచ్చగొట్టింది.

అందుకే భార్యమీద విసుక్కున్నాడు.

''శృంగారాన్ని గురించి ఆడది ఇంత బరితెగించినట్లు మాట్లాడ్డం పర్వర్టెడ్‌గా వుంటుంది. అయినా నీకెప్పుడూ అదే యావ'' అంటూ విసురుగా లేచిపోయాడు.

హతాశురాలైపోయింది స్వరూప. ఒంట్లో శక్తినంతా ఎవరో లాగేసినట్లుగా నీర్సంగా తడబడే అడుగుల్తో భర్తను అనుసరించిందామె. తనేమంత బరితెగించిందని అతడు అంతలా కోపం తెచ్చుకోవడానికి.

అర్ధరాత్రి భర్త పక్కలో నిద్రిస్తోన్న పరాయి ఆడదాన్ని లేపి తనగదిలోకి తీసికెళ్ళడం పర్వర్షన్ కాదు అతడి దృష్టిలో... కానీ భార్య తన స్వంత భర్తతో నన్నెందుకు మీరు గుర్తించరు అంటూ నిలదీసి అడగడం మాత్రం పర్వర్టెన్.

సముద్రంలోకి కృంగిపోతూన్న సూర్యుడూ, ఉత్తుంగ తరంగాలతో ఎగిసెగిసి పడుతోన్న సముద్రుడూ, ఇరివురూ అనాధల్లా అతడి వెంట నడుస్తోన్న స్వరూపని చూసి జాలిగా నవ్వారు.

**వచ్చేవారం**

**మరో సెంటర్ సెన్సేషన్***

